క్లుప్తంగా

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

నగరి: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సి.జానకి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కక్షిదారులకు మంచి అవకాశమన్నారు. కోర్టుల్లో ఎప్పటి నుంచో ఉన్న కేసులను రాజీ చేసుకుని.. కొత్త జీవితాన్ని పొందేందుకు లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. అధిక సంఖ్యలో క్రిమినల్, సివిల్, బ్యాంకులకు సంబంధించి కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు.

ఉచితంగా విద్యా సామగ్రి పంపిణీ


విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న దాత

నింద్ర: పేద విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యంగా వారికి మెరుగైన విద్యాసామగ్రి అందించడమే శివశక్తి ఆశ్రమం లక్ష్యమని వ్యవస్థాపకుడు కుమార్ అన్నారు. నింద్ర జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్‌గా గాలి మహేష్



ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకుంటున్న గాలి మహేష్

పాలసముద్రం: సౌత్‌వెస్టర్న్ అమెరికన్ యూనివర్సిటీ రిటైర్డ్ డీఐజీ దొరైరాజ్ ఆధ్వర్యంలో శనివారం చెన్నై ఎగ్మోర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్‌కి డాక్టరేట్ అందుకున్నారు. అంతేకాకుండా జీఏసీ ఎక్సలెన్స్ వారు బెస్ట్ పంచాయతీ ప్రెసిడెంట్ అవార్డు అందజేశారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

పుత్తూరు: అదనంగా కట్నం రూ.50 లక్షలు తీసుకురావాలంటూ ఇంటి నుంచి వెళ్లగొట్టారని బాధితురాలు పి.ఎం.ధనుషా(29) ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం పుత్తూరు పోలీసులు వరకట్న వేధింపుల కేసును నమోదు చేశారు. సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు స్థానిక షాపువీధికి చెందిన పి.ఎం.ధనుషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన భర్త డి.గౌతమ్‌రాకేష్, అత్త డి.ప్రమీల, బి.పద్మ, ఎస్.మధుసూదనరాజు, డి.చైతన్యవర్మ, ఎస్.గుణశేఖర్‌రాజు, కె.కృష్ణవేణిపై వరకట్నం వేధింపుల కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అతిసార నివారణపై అవగాహన

గుడిపాల: అతిసార నివారణపై శనివారం గుడిపాల వైద్యాధికారి సంధ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ తరచూ చేతులు శుభ్రం చేసుకోవడంతోపాటు ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ముఖ్యంగా దోమలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ, చంద్రశేఖర్, సెల్వి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా అక్కమ్మ దేవత తిరునాళ్లు

గుడిపాల: మండలంలోని రామభద్రాపురం గ్రామంలో ఉన్న గ్రామదేవత అక్కమ్మ దేవత తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి, విరుపాక్షమ్మ దగ్గర పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మేళతాళాలు మధ్య, బాణసంచావేడుకలతో వైభవంగా ఉత్సవమూర్తులు అమ్మవారి గెరిగలను జోడించి ఊరేగింపు నిర్వహించారు. ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్, గ్రామస్తులు సురేంద్రబాబు, అమరేంద్రబాబు, వరదరాజులు, సురేంద్రనాయుడు, శ్రీధర్, ధనంజయ, గోవర్ధన్ పాల్గొన్నారు.

కాయకష్టం.. రోడ్డుపాలు


రోడ్డుపై పారబోసిన తోతాపురి మామిడి

- చేతులెత్తేసిన ప్రభుత్వం
- పుత్తూరులో తోతాపురి కిలో రూ.2 అంటున్న వ్యాపారులు
- కోతకూలి కూడా రాదంటూ మండిపడుతున్న రైతాంగం
- పంటను రోడ్డుపై పారబోస్తున్న వైనం
- కాయలు కోయకుండా చెట్లలోనే వదిలేస్తున్న పరిస్థితి

ఆరుగాలం శ్రమించి, వ్యయ ప్రయాసలతో పండించిన పంటను అమ్ముకోలేని దీనస్థితిలో రైతాంగం కొట్టుమిట్టాడుతోంది. మామిడి పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మార్కెట్ యార్డుల్లోని వ్యాపారులు, గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు సైతం కొనుగోలు చేయడం లేదు. దీంతో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసినట్లు కనబడుతోంది. గత నెల రోజులుగా రైతులు రోడ్డునపడి చేస్తున్న ఆందోళనలు, పడుతున్న బాధలను పట్టించుకోకపోవడంపై ప్రభుత్వ తీరు స్పష్టమవుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ల ఆదేశాలను సైతం పాటించడం లేదనే అంశం స్పష్టమవుతోంది. –పుత్తూరు

పుత్తూరు: గత ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మామిడి రైతులు చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోలేక రోడ్డుపై పారబోస్తున్నారు. వ్యాపారులు, గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు తోతాపురి కిలో రూ.8కి కొనుగోలు చేస్తే, రూ.4 ప్రోత్సాహక నిధితో కలిపి మొత్తం కిలో రూ.12గా ప్రభుత్వం ధరను నిర్ణయించింది. ఈ మేరకు జీఓను సైతం విడుదల చేసింది. అయితే ఆచరణలో పూర్తిగా విఫలమైంది. గుజ్జు యాజమాన్యాలు రూ.4కు మించి కొనుగోలు చేయడం లేదు. ఈ మాత్రం కొనుగోళ్లకి టోకెన్లు తీసుకోవాలంటూ ప్రకటించాయి. ఫ్యాక్టరీలు జారీ చేసే టోకెన్లు పొందేందుకు క్యూ లైన్లలో రైతులు పడిగాపులు పడుతున్నారు. ఈ టోకెన్ల జారీలోనూ రాజకీయ జోక్యంతో అసలైన రైతులకు అరకొరగా జారీ చేసి, మిగిలినవి కూటమి నాయకుల సిఫారసు చేసినవారికే అందజేస్తున్నారు. పుత్తూరు మార్కెట్ యార్డులోని వ్యాపారులు తోతాపురి రూ.2కి అయితే కొనుగోలు చేస్తున్నారు. నాలుగు, ఐదు ఇచ్చే పరిస్థితి లేదంటూ తెగేసి చెబుతున్నట్లు రైతులు వాపోతున్నారు. దీంతో ఈ ప్రాంత రైతులు కోత కూలి కూడా గిట్టుబాటు కాదంటూ కాయలను చెట్లకే వదిలేస్తున్నారు. కొందరు కోసి రవాణా చార్జీలు దండగ అంటూ రోడ్డుపైనే పారబోస్తున్నారు.

మార్కెటింగ్ ఏడీ నోట రూ.2 మాట

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.పరమేశ్వరన్ పుత్తూరు మార్కెట్ యార్డును సందర్శించారు. మండీ యజమానులతో ధరలపై ఆరా తీశారు. తోతాపురి కిలో రూ.4 వంతున నీలం కిలో రూ.10 వంతున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పంట పూర్తి కావస్తున్న నేపథ్యంలో పంట యార్డుకు పెద్దగా రావడం లేదంటూ చెప్పుకొచ్చారు. అనంతరం ఏడీ పరమేశ్వరన్ మీడియాతో మాట్లాడారు. ఇక్కడి పరిస్థితులను బట్టి చూస్తే పుత్తూరులో రూ.2కే కొనుగోలు చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. మండీల వారు రూ.4కి కొనుగోలుకు చేస్తే ఎలాంటి లాభాపేక్ష లేకుండా గుజ్జు పరిశ్రమలకు రూ.4కే ఎలా విక్రయిస్తారంటూ ప్రశ్నించారు. ఇక్కడ రూ.2కు మించి కొనుగోలు చేయడం లేదని అర్థమవుతోందన్నారు. అందుకే రైతులు ఈ యార్డుకు రావడం లేదని అభిప్రాయపడ్డారు. ఇక్కడి పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పుత్తూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి తులసీరామ్ ఉన్నారు.

చెప్పిన మాట నిలబెట్టుకోండి

ఇకనైనా ప్రభుత్వం ప్రకటించిన విధంగా మామిడి ధరల విషయంలో చిత్తశుద్ధితో ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఆయా మండలాల్లో టోకెన్లు జారీ చేయాలని, అన్ని గుజ్జు ఫ్యాక్టరీల యాజమాన్యాలు విధిగా రూ.8కి కొనుగోలు చేయడంతోపాటు ప్రభుత్వం ప్రకటించిన విధంగా పోత్సాహక నిధి నుంచి రూ.4 విధిగా చెల్లించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు.


చెట్లకే పరిమితమైన కాయలు


ధరలు లేక, రైతులు రాక బోసిపోయిన పుత్తూరు మండీ


వ్యాపారులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్

వేణుగోపాలుని సన్నిధిలో అన్నదానం


ఆలయ ఆవరణలో అన్నదానం

కార్వేటినగరం: ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరానికి చెందిన రేయాన్‌రామ్ కుటుంబ సభ్యులు శనివారం అన్నదానం చేపట్టారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాదాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

మాతమ్మకు సారె సమర్పణ


సారె తీసుకెళ్తున్న సదాశివేశ్వరాలయ సిబ్బంది

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని సుద్దగుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీమాతమ్మ అమ్మవారి ఆలయంలో మాతమ్మ కొలుపును ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆనవాయితీ ప్రకారం సుద్దగుంట సమీపంలో వెలసిన శిష్ఠ సౌందర్యవల్లి సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయం నుంచి మాతమ్మ అమ్మవారికి ఆలయ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు శనివారం మేళతాళాల నడుమ సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందించారు.

యోగా సంబరం


పుత్తూరు: వైద్య సిబ్బంది యోగాసనాలు


యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు రాఘవేంద్ర, జానకి

నగరి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలు, కళాశాలల్లో యోగా సంబరాలు నిర్వహించారు. పీసీఎన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సంబరాల్లో ఆర్డీఓ భవానీ శంకర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. గుండ్రాజుకుప్పం గ్రామంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి, ఎంఈఓ శ్రీదేవి, సర్పంచ్ బాలప్రసాద్‌రెడ్డి విద్యార్థులతో కలిసి యోగా ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎం.కొత్తూరు పాఠశాలలో తహసీల్దార్ రవికుమార్ పాల్గొని యోగాసనాలు వేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వేణుగోపాల్, అధ్యాపకులు యోగాసనాలు వేశారు.

యోగా.. సంస్కృతికి ప్రతీక

పుత్తూరు: భారతీయ సంస్కృతిలో యోగా ఓ భాగమని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. శనివారం పట్టణంలో పలు చోట్ల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సబ్ కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, న్యాయవాదులు, సిబ్బంది యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక రాస్ సేవా సమితి ఆధ్వర్యంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అన్నాగౌరీ వైద్యశాలలో నిపుణుల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు.

యోగాతోనే వ్యక్తిత్వ వికాసం

నింద్ర: నిత్యం యోగా సాధన చేస్తే వ్యక్తిత్వ వికాసం సాధ్యమని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ అన్నారు. శనివారం యోగా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో...

గంగాధరనెల్లూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం గంగాధరనెల్లూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణ, వీరక నెల్లూరు భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం, నెల్లేపల్లి, గంగాధరనెల్లూరు, తూగుండ్రం జడ్పీ హైస్కూల్, వివిధ సచివాలయాల పరిధిలో గ్రామస్తులు, అధికారులు ఉద్యోగులు యోగాసనాలు వేశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: జీవితానికి యోగా ఎంతో అవసరమని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎం.వెంకటరమణ, ఎంపీడీఓ సతీష్ తెలిపారు. శనివారం తిరుమళరాజుపురంలో తహశీల్దార్ అరుణ కుమారి ఆధ్వర్యంలో పాలసముద్రం ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, మాజీ జెడ్పీటీసీ చిట్టిబాబు నాయుడు, ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి, ఆర్ఐ దేవి తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో యోగా దినోత్సవం

కార్వేటినగరం: జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 మనోజ్ కుమార్ మాట్లాడుతూ యోగా ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డైట్ అధ్యాపకులు దామోదర్, నాగరాజునాయక్, రెడ్డెమ్మ, హేమలత, నీరజ, రంజిత్, రాజ్‌కుమార్, శైలిజరాణి, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ మున్సిపల్ పార్కులో..

పుత్తూరు: ఆర్‌కే రోజా రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో రూపుదిద్దుకున్న వైఎస్సార్ మున్సిపల్ పార్కులో అధికారులు యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మంజునాథ్‌గౌడ్, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మానసిక ప్రశాంతతకు యోగా అవసరమని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని వెదురుకుప్పం, నల్లవెంగనపల్లె, బొమ్మయ్యపల్లె, పచ్చికాపల్లంతోపాటు అన్ని పంచాయతీల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. తహశీల్దార్ బాబు, సీడీపీఓ శోభారాణి, సర్పంచ్‌లు గోవిందయ్య, పుష్ప, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


పుత్తూరు: వైఎస్సార్ మున్సిపల్ పార్కులో యోగాసనాలు

కుతూహలమ్మకు ఘన నివాళి


కుతూహలమ్మకు నివాళులర్పిస్తున్న అనగంటి హరికృష్ణ, నాయకులు

గంగాధరనెల్లూరు: రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్ గుమ్మడి కుతూహలమ్మ జయంతి సందర్భంగా ఆమె కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు అనగంటి హరికృష్ణ ఆమె సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగాధరనెల్లూరు మండలంలో వింజం లక్ష్మీరెడ్డిపల్లి గ్రామంలోని గుమ్మడి కుతూహలమ్మ సమాధి వద్ద నివాళులర్పించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆమె చేసిన సేవలు అభివృద్ధి కార్యక్రమాలు మరువలేనివని గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్కూరు బాబురెడ్డి, వెంకటరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామక్క, వింజం గోవిందన్, సురేంద్ర రెడ్డి, చంద్రారెడ్డి, హనీఫ్ బాషా, వెంకటేష్ రెడ్డి, భానుచంద్రారెడ్డి, కుట్టి, ఖాదర్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

మామిడి కాయల లారీ బోల్తా


చిన్నకనుమ మలుపు వద్ద బోల్తాపడిన మామిడి కాయల లారీ

కార్వేటినగరం: మామిడి కాయల లారీ బోల్తా పడిన సంఘటన మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని చిన్నకనుమ మలుపు వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వైపు మామిడి కాయల లోడ్డుతో వస్తున్న లారీ చిన్నకనుమ మలుపు వద్ద అదుపు తప్పి పది అడుగుల పల్లంలోకి బోల్తాపడింది. దీంతో లారీలోని కాయలు చెల్లాచెదురయ్యాయి. దీంతో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మార్గంలో తమిళనాడు నుంచి తిరుపతికి నిత్యం ప్రయాణికులతో బస్సులు, ఆటోలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదకరంగా ఉన్న చిన్నకనుమ మలుపు వద్ద అనేక ప్రమాదాలు చోటు చేసుకుని, ప్రాణాలను కోల్పోయిన రోజులు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, చిన్నకనుమ మలుపు వద్ద చూచిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు అంటున్నారు.